క్లుప్తంగా

దేవాంగుల అభ్యున్నతికి సమష్టి కృషి



మాట్లాడుతున్న సత్యరాజ్ కుమార్

గాజువాక : దేవాంగుల సంక్షేమానికి అందర్నీ కలుపుకొని కృషి చేస్తానని విశాఖ జిల్లా దేవాంగుల సంక్షేమ సంఘం నూతన అధ్యక్షుడు బొమ్మన్న సత్యరాజ్ కుమార్ అన్నారు. గాజువాకలో ఆదివారం నిర్వహించిన దేవాంగ సంక్షేమ సంఘం ద్వితీయ మహాజన సభలో కార్యవర్గం ఎన్నిక అనంతరం ఆయన మాట్లాడారు. వస్త్రాల తయారీలో దేవాంగులది కీలక పాత్ర అని, వారి సమస్యల పరిష్కారం కలసికట్టుగా కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఎంఆర్ అధినేత మావూరి వెంకట రమణ, సంఘం సీనియర్ నాయకుడు ఉప్పు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

టూ వీలర్ మెకానిక్‌లను కార్మికులుగా గుర్తించాలి



సమావేశంలో ప్రసంగిస్తున్న రాము

గాజువాక : టూ వీలర్ మెకానిక్‌లను అసంఘటితరంగ కార్మికులుగా గుర్తించాలని ఆంధ్రప్రదేశ్ టూ వీలర్ మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జి.రాము కోరారు. గాజువాకలో ఆదివారం నిర్వహించిన అసోసియేషన్ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. భవన నిర్మాణ కార్మికులకు వర్తించే అన్ని పథకాలను టూ వీలర్ మెకానిక్‌లకు అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు అప్పారి విష్ణుమూర్తి, జి.దామోదరరావు, వంగపండు గణేష్, రెడ్డిపల్లి రాజు, జి.వెంకటేశ్వరరావు, చంటి, సోమేష్, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపైనే చెత్తా చెదారం



రోడ్డుపై విచ్చలవిడిగా వ్యర్థాలు

పెదగంట్యాడ: మండలంలోని చిన నడుపూరు వుడా కాలనీ ప్రధాన రహదారిలో చెత్తాచెదారాన్ని విచ్చలవిడిగా పడేస్తున్నారు.. ఇక్కడ డంపర్ బిన్‌ను సక్రమంగా పెట్టకపోవడంతో స్థానికులు, వ్యాపారులు తమ ఇళ్లలోని, వ్యాపారాలకు చెందిన చెత్తను రోడ్డుపై విసిరేస్తున్నారు. దీంతో పందులు, పశువులు అక్కడ చేరి చిందరవందర చేస్తున్నాయి. తద్వారా దుర్వాసన వెదజల్లుతోంది. ఈ రోడ్డులో ఎప్పటికప్పుడు చెత్తాచెదారాన్ని తొలగించకపోవడంతో డంపర్ బిన్లు నిండిపోతున్నాయి. ఇక్కడ నిత్యం ఇదే పరిస్థితి నెలకొని ఉన్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుపై చెత్త వేయకుండా చూడాలని, అలాగే ఎప్పటికప్పుడు చెత్తను తరలించాలని కోరుతున్నారు.

డాక్టర్ ఖాదర్ వలీకి సన్మానం నేడు

ఎంవీపీ కాలనీ: మిల్లెట్ ఆహారంపై విశేష కృషి చేసిన పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ ఖాదర్ వలీకి సన్మాన కార్యక్రమం నిర్వహించనున్నట్టు గో ఆధారిత ప్రకృతి పంటల రైతు సంఘం సంఘం చైర్మన్ పీఎల్ఎన్ రాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం సాయంత్రం 4 గంటలకు మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియం వేదికగా ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. తొలుత సాయంత్రం డాక్టర్ ఖాదర్ వలీ ప్రసంగం ఉంటుందని, అనంతరం పౌర సన్మానం చేస్తామని తెలిపారు.

దువ్వాడ స్టేషన్‌లో సమస్యల కూత

- దువ్వాడ రైల్వేస్టేషన్ దశ మారేనా
- ఎటు చూసినా ఇబ్బందులే
- రైల్వే అధికారులు దృష్టి సారించాలని విజ్ఞప్తి



మూసి వేసిన ద్వారం



ఒకటో నంబర్ ప్లాట్‌ఫారంపై నిలిచిన వర్షం నీరు



దువ్వాడ రైల్వేస్టేషన్ ముఖ ద్వారం



ఒకటే ద్వారం ఉండడంతో ప్రయాణికుల రద్దీ

అగనంపూడి: అమృత్ భారత్ రైల్వేస్టేషన్ల జాబితాలో దువ్వాడ రైల్వేస్టేషన్‌కు చోటు దక్కిన క్రమంలో అభివృద్ధి వైపు అడుగులు పడతాయనే ఆశతో పారిశ్రామిక ప్రాంత ప్రయాణికులు ఎదురు చూస్తున్నారు. దశాబ్దన్నర క్రితం ఆదర్శ రైల్వేస్టేషన్‌గా దువ్వాడను ప్రకటించిన తరువాత అరకొర అభివృద్ధి చేసి చేతులు దులుపేసుకున్నారు. ఇప్పుడాపరిస్థితి రానివ్వొద్దని ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు. నాలుగో నంబర్ ప్లాట్‌ఫారంపై మరుగుదొడ్ల వసతి కూడా కల్పించలేని దయనీయ స్థితిలో రైల్వే అధికారులు ఉన్నారు. దువ్వాడ రైల్వేస్టేషన్ పై పక్క రాష్ట్రానికి చెందిన రైల్వే ఉన్నతాధికారులు, రైల్వే బోర్డు అధికారులు వివక్ష చూపిస్తున్నారని ప్రజా సంఘాలు దుమ్మెత్తి పోస్తున్నాయి.

దువ్వాడలో 44 జతల ఎక్స్‌ప్రెస్ రైళ్లతోపాటు స్పెషల్ రైళ్లు, వారాంతపు రైళ్లు రాకపోకలతో రోజురోజుకూ ప్రయాణికుల తాకిడి పెరుగుతోంది. ఏటా రూ.30 కోట్ల ఆదాయం సమకూరుతుండగా, 14 లక్షల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు.

నాలుగో నంబర్ ప్లాట్‌ఫారంపై ఉన్న విశ్రాంతి గదిలో మాత్రమే మరుగుదొడ్లు ఉన్నాయి. ఉదయం 9 నుంచి సాయంత్రం ఏడు వరకు మాత్రమే విశ్రాంతి గదిని తెరిచి ఉంచుతున్నారు. తరువాత సిబ్బంది తాళాలు వేసి వెళ్లిపోతుండడంతో ప్రయాణికులు ముఖ్యంగా మహిళలు మరుగుదొడ్ల కోసం అవస్థలు పడాల్సి వస్తోంది.

బయటకు వెళ్లే సమయంలో తోపులాట...

నాలుగో నంబర్ ప్లాట్‌ఫారం వైపు ఒకే మార్గం అందుబాటులో ఉంచారు. మూడేళ్ల క్రితం ప్లాట్‌ఫారం ఎత్తును పెంచే సమయంలో రెండో మార్గాన్ని మూసేశారు. గతంలో రెండు ద్వారాలు ఉండడంతో ప్రయాణికులకు ఇబ్బంది ఉండేది కాదు. ప్రస్తుతం ఒకే మార్గం ద్వారా రాకపోకలు సాగుతుండడంతో ప్రయాణికుల మధ్య తోసుకుంటూ వెళ్లాల్సిన పరిస్థితి ఉంది.

ప్లాట్‌ఫారంల నిర్మాణం.. నిబంధనలు విరుద్ధం

ఒకటి, నాలుగు ప్లాట్‌ఫారంల ఎత్తు నిబంధనల మేరకు లేకపోవడం, ప్లాట్‌ఫారంలు పట్టాల మధ్య దూరం ఎక్కువగా ఉండడం వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రజాసంఘాలు రైల్వే అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయంలో కొందరు డివిజన్ అధికారులు ఉన్నతాధికారులను తప్పుదోవ పట్టిస్తున్నారని ప్రయాణికులు మండిపడుతున్నారు. తరచూ ప్రమాదాలు జరుగుతున్నా కారణాలు కనుక్కొని వాటిని సరిచేయాల్సిన అధికారులు మొండిగా వ్యవహరించడం తగదని అంటున్నారు.

షెల్టర్లు విస్తరించాలి

ఒకటో నంబర్ ప్లాట్‌ఫారంపై ముఖ ద్వారానికి రెండు వైపులా పది మీటర్ల నిడివిలోనే రేకుల షెడ్లు నిర్మించారు. తరువాత ఎక్కడా రేకుల షెడ్లు లేకపోవడంతో ప్రయాణికులు అంతా ఎండా, వాన కాలాల్లో ఒకేచోట కూర్చొని, రైళ్లు వచ్చే సమయానికి లగేజీలు, పిల్లలు, వృద్ధులతో పరుగులు తీయాల్సి పరిస్థితి ఉందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

టికెట్ కౌంటర్ వద్ద లీకేజీలు

టికెట్ బుకింగ్ కౌంటర్, విచారణ కేంద్రం ముఖ ద్వారం, ప్రధాన భవనంలో ఉంది. అయితే టికెట్ కౌంటర్ వద్ద భవనం శ్లాబ్ లీకేజీ కారణంగా వర్షాలు పడితే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలంలో ప్లాట్‌ఫారంలపై వర్షపు నీరు నిలిచిపోతుంది. ప్లాట్‌ఫారం ఎత్తు పల్లాలుగా ఉండడంతో నీరు నిలిచిపోయి నాచు పడుతుంది.

కానరాని ఎస్కలేటర్లు

దువ్వాడ రైల్వేస్టేషన్‌కు వేలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. లిఫ్టలు, ఎస్కలేటర్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఒకటో నంబర్ ప్లాట్‌ఫారంపై ముందుగా లిఫ్ట్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తుంటే అధికారులు మాత్రం ముందుగా నాలుగో నంబర్ ప్లాట్‌ఫారంపై ఏర్పాటు చేయడం కొసమెరుపు.

విశాఖ ఉక్కు రక్షణకు ఎంవీవీ కృషిపై హర్షం



ఎంపీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

గాజువాక : ప్రైవేటీకరణ నుంచి విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ చేస్తున్న కృషిపై వైఎస్సార్‌టీయూసీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి ఆధ్వర్యంలో యూనియన్ నాయకులు ఎంపీని నగరంలో ఆదివారం కలిసి ధన్యవాదాలు తెలిపారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా, ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలన్న డిమాండ్‌పై ప్రతి పార్లమెంట్ సమావేశంలోను ప్లకార్డుల ప్రదర్శన, ఎంపీల సంతకాలను సేకరించి ప్రధానమంత్రికి అందజేయడం అభినందనీయమని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు. ఎంపీని కలిసినవారిలో నాయకులు వై.మస్తానప్ప, మార్టుపూడి పరదేశి, సంపంగి ఈశ్వరరావు, పిట్టా రెడ్డి, వాసా అప్పలరెడ్డి, రోజారాణి, ఉమ తదితరులున్నారు.

ప్రజల్లోకి భారత్ ప్రగతి



సమావేశంలో ప్రసంగిస్తున్న జీవీఎల్ నర్సింహారావు

గాజువాక : ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో భారతదేశం సాధించిన ప్రగతిని బీజేపీ కార్యకర్తలు ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నర్సింహారావు కోరారు. ప్రధాని నిర్వహిస్తున్న మన్‌కీ బాత్ కార్యక్రమం సందర్భంగా స్థానిక బీజేపీ నాయకులతో ఆదివారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రపంచవ్యాప్త అభివృద్ధిలో భారతదేశం మూడో స్థానంలో ఉందని, దీనికి మోదీ విధానాలే కారణమని పేర్కొన్నారు. సమావేశం అనంతరం పలువురు కార్యకర్తలను సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ గాజువాక కో ఆర్డినేటర్ కరణంరెడ్డి నర్సింగరావు, నాయకులు దీనంకొండ కృష్ణంరాజు, గూటూరు శంకరరావు, బాటా శ్రీను, జీలకర్ర రమణ, లక్కరాజు సోంబాబు, బొండా ఎల్లాజీరావు, గరికిన పైడిరాజు, రోహిణి, పద్మ, పావని తదితరులు పాల్గొన్నారు.

జొన్నకూటికి పురస్కారం



ఎమ్మెల్యే జక్కంపూడి రాజా చేతుల మీదుగా పురస్కారం అందుకుంటున్న విజయ్‌కుమార్

అగనంపూడి: సామాజిక సేవా కార్యకర్త, హ్యూమన్ రైట్స్ జాతీయ ఉపాధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు జొన్నకూటి విజయ్‌కుమార్‌కు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాహిత్య అకాడమి, రాష్ట్ర దృశ్య కళా అకాడమీ, కేంద్ర సంగీత నాటక అకాడమీ సంయుక్తంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉగాది నంది పురస్కారాన్ని అందించింది. ఈమేరకు తూర్పుగోదావరి జిల్లా రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకున్నారు. సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్న తనకు ఈ గౌరవం దక్కడం సంతోషంగా ఉందని ఆయన తెలిపారు. పురస్కార కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ముద్దాల అను, ఫిలాంత్రోఫిక్ సొసైటీ అధ్యక్షుడు అద్దంకి రాజా యోనాలు పాల్గొన్నారు.

వైభవంగా నారసింహుడికి ఆర్జిత సేవలు



కంకణధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఉదయం 7నుంచి 8గంటల వరకు స్వర్ణపుష్పార్చన నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను కల్యాణ మండపంలో వేదికపై అధిష్టంపజేశారు. 108 స్వర్ణ సంపెంగ పుష్పాలతో అష్టోత్తరశత నామావళి పూజ చేశారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ఆలయ పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ కనకరాజు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఘనంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం నిత్యకల్యాణం ఘనంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టంపజేసి కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం,జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం చేశారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేష వస్త్రాలు అందజేశారు.

30న సీతారాముల కల్యాణోత్సవం

సింహాచలం: శ్రీరామ నవమిని పురస్కరించు కుని ఈనెల 30న సింహగిరిపై పురాతన రామాలయంలో సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహిస్తున్నట్టు వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఈవో వి.త్రినాథరావు ఆదివారం తెలిపారు. ఆరోజు ఉదయం 10.30 గంటలకు ఆలయ ప్రాంగణంలో కల్యాణం నిర్వహించ డం జరుగుతుందన్నారు. భక్తులంతా కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని కోరారు. అలాగే సింహగిరిపై రాజగోపురం వద్ద ఉన్న కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని సీతారాముల సన్నిధిలో కూడా కల్యాణ మహోత్సవం ఉదయం 10.30గంటల నుంచి జరుగుతుందని పేర్కొన్నారు.

అంగన్‌వాడీ పాఠశాలకు వితరణ



వస్తువులను అందజేస్తున్న సత్యసాయి సమితి ప్రతినిధులు

ఉక్కునగరం: యలమంచిలి దొడ్డి అంగన్‌వాడీ పాఠశాలకు స్టీల్‌ప్లాంట్ సత్యసాయి సమితి యువకులు సామగ్రి అందజేశారు. గ్రామసేవలో భాగంగా ఆదివారం వారు పాఠశాల నిర్వాహకులకు టేబుల్, వాటర్ ఫిల్టర్, సీలింగ్ ఫ్యాన్, ప్రెజర్ కుక్కర్, గ్యాస్ స్టవ్, ప్లాస్టిక్ మ్యాట్స్, పాత్రలు, స్టీల్ ప్లేట్లు, స్టీల్ గ్లాసులు అందజేశారు. సత్యసాయి సమితి యువకులు చేసిన సాయానికి పాఠశాల నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సమితి కన్వీనర్ జి. రామకృష్ణ, వి. కృష్ణ, కె. ప్రకాశరావు, రామచంద్రరావు, పల్లా కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌లోకి మధుర ఫలం



నీలమ్మవేపచెట్టు వద్ద అమ్మకానికి ఉంచిన మామిడి పండు

అల్లిపురం: అందరికీ ఇష్టమైన మధుర ఫలాలు మామిడి పండ్లు మార్కెట్లోకి వచ్చేశాయి. వాస్తవానికి వైశాఖ మాసంలో అందుబాటులోకి వచ్చే మామిడి పండ్లు నెల రోజులు ముందుగానే దర్శనమిచ్చాయి. విజయనగరం జిల్లా అలమండ నుంచి రైతులు మామిడి పండ్లు తీసుకుని వచ్చి నగరంలో అమ్మకాలు జరుపుతున్నారు. డజను రూ.250కి విక్రయిస్తున్నారు.

నిమ్మకాయ ధరలు పైపైకి..



పూర్ణామార్కెట్ వద్ద అమ్మకాలు చేస్తున్న నిమ్మకాయలు

జగదాంబ: నిమ్మకాయ ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ఎండాకాలం, ఆపై రంజాన్ నెల కావడంతో నిమ్మకాయ ధరలు అమాంతరం పెరిగిపోయాయి. రూ.10కు ఐదు నుంచి ఏడు కాయలు ఇచ్చే వ్యాపారులు.. ఇప్పుడు రెండు మాత్రమే ఇస్తున్నారు. అవి కూడా చాలా చిన్నగా ఉంటున్నాయి. ఏలూరు నుంచి దిగుబడి అయ్యే నిమ్మకాయలు.. పంట లేకపోవడంతో ధరల పెరుగుదలకు కారణమని వ్యాపారులు చెబుతున్నారు. బస్తా నిమ్మకాయలు రూ.2,500 వచ్చేవని, ఇప్పుడు బస్తా రూ.10వేలు పెట్టాల్సి వస్తుందని అంటున్నారు. కిలోల లెక్కలో అమ్మకాలు చేస్తే తప్ప, తమకు గిట్టుబాటు అవదని వ్యాపారులు చెబుతున్నారు.

ఉత్సాహంగా ఉగాది పురస్కారాలు



ఉగాది పురస్కారాలను ప్రదానం చేస్తున్న ప్రభుత్వ విప్ ధర్మశ్రీ, ఎమ్మెల్యే నాగిరెడ్డి తదితరులు



కూచిపూడి నృత్య ప్రదర్శన

పెదగంట్యాడ: మన సంస్కృతీ సంప్రదాయాలను విస్తృతంగా ప్రచారం చేస్తున్న కళాకారులను సత్కరించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రభుత్వ విప్, చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ అన్నారు. శ్రీ పైడిమాంబ ఫైన్ ఆర్ట్స్ అధ్యక్షుడు మునగపాక బాబూరావు ఆధ్వర్యంలో పలు రంగాల్లో విశిష్ట సేవలందిస్తున్న పలువురికి ఆదివారం సాయంత్రం ఉగాది పురస్కారాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడారు. సేవా రంగంలో ఉంటున్న వారికి ఇటువంటి పురస్కారాలు అందజేసి వారిలో మరింతగా ఉత్సాహాన్ని నింపాలని పిలుపునిచ్చారు. వీరిని ఆదర్శంగా తీసుకుని మరింత మంది సేవా రంగంలోకి రావాలని కోరారు. గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి మాట్లాడుతూ సమాజ సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని కోరారు. ఒక్కొక్కరికి ఒక్కో రంగంలో ఆసక్తి ఉంటుందని, ఆయా రంగాల్లో రాణిస్తున్న వారికి మనవంతు ప్రోత్సాహం అందించాలన్నారు. అనంతరం నెల్లి సాధూరావు, గళ్లా శంకర్‌సాయిరాం, బెల్లాల నాగేశ్వరరావు, ఏకుల వెంకటేష్ గౌడ్, దానబోయిన అప్పలనాయుడు, దుంగ దేవన్‌రాజు, పెద్దింటి సూర్యనారాయణ, పాలిక సంజీవరావు, నెల్లి తులసి, డాక్టర్ హేమలత తదితరులకు ఉగాది పురస్కారాలు అందజేశారు. అలాగే జ్ఞాపికలు అందజేసి, శాలువలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు తిప్పల గురుమూర్తిరెడ్డి, చింతలపూడి వెంకట్రామయ్య, సినీ నటుడు ప్రసన్నకుమార్, కోన తాతారావు, మంత్రి శంకరనారాయణ, రౌతు గోవింద్, పంచదార్ల పెంటారావు, సియ్యాద్రి అప్పలరాజు, నమ్మి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఈపీఎఫ్ హయ్యర్ పెన్షన్ విధానంపై స్పష్టత ఇవ్వాలి

అక్కిరెడ్డిపాలెం : ఇటీవల ఈపీఎఫ్ ఉద్యోగులకు ప్రవేశపెట్టిన హయ్యర్ పెన్షన్ స్కీం మీద అనేక రకాల సందేహాలు ఉద్యోగుల్లో గందరగోళం నెలకుందని విశాఖ డెయిరీ అసిస్టెంట్ మేనేజర్ (పేరోల్) వై.మాధవ స్వామి పేర్కొన్నారు. ఉద్యోగులు ప్రస్తుతం సర్వీసులో ఉండి 2014 సెప్టెంబర్‌లో జాయిన్ ఆప్షన్ ఇవ్వని ఉద్యోగులు ఇప్పుడు పెన్షన్ తీసుకుందామంటే వస్తుందా రాదా అనే అనుమానంలో ఉన్నారన్నారు. ఒక వేళ పెన్షన్‌కు అర్హత ఉంటే ఉద్యోగి తన వంతు షేర్ ఎంత చెల్లించాలి, సర్వీసు బట్టి ఎంత పెన్షన్ వస్తుంది అనేది ఈపీఎఫ్ అధికారులు తమ వెబ్‌సైట్‌లో పొందు పర్చాలని కోరారు. ఒక వేళ ఉద్యోగికి ఈపీఎఫ్ అకౌంట్‌లో సరిపడా డబ్బులు లేకపోతే ఎలా అంటూ అనేక రకాల సందేహాలను వ్యక్తం చేశారు. ఉద్యోగి హయ్యర్ పెన్షన్ స్కీం ఆప్షన్‌ను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునే సమయంలో తను ఎంత మొత్తం చెల్లించాలి, ఎంత పెన్షన్ వస్తుందో అధికారులు తెలపాలన్నారు. ఉద్యోగి ఇప్పుడు ఆప్షన్ తీసుకోవడానికి అర్హుడా కాదా అన్న వివరాలను అధికారులు ఈపీఎఫ్ వెబ్‌సైట్‌లో పొందుపర్చాలన్నారు. సమాచార వ్యవస్థను పెంపొందించే విధంగా అధికారులు చొరవచూపాలన్నారు. ఆప్షన్ నమోదు గడువును పెంచి, నమోదు కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా ఈపీఎఫ్ అధికారులను కోరారు.

ప్రభుత్వ రంగాలను పరిరక్షించాలి



దీక్షలో పాల్గొన్న ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం : దేశ స్వాతంత్ర్యం తర్వాత ప్రభుత్వరంగ పరిశ్రమల వల్లనే దేశంలో ఆర్థికాభివృద్ధి విస్తరించిందని, కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థల పరిరక్షణకు కృషి చేయాలి తప్ప మూసివేయడం తగదని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు పేర్కొన్నారు. విశాఖ ఉక్కు దీక్షలు ఆదివారం నాటికి 773వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా టీఎన్‌టీయూసీ కాంట్రాక్ట్ కార్మికులు దీక్షలో పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బడా వ్యాపారులకు దేశాన్ని తాకట్టు పెట్టేలా బీజేపీ వ్యవహరిస్తోందన్నారు. ఉక్కు ఉద్యమానికి కేంద్ర ప్రభుత్వం స్పందించే విధంగా కార్మికులు పోరాడాలన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం మొండి వైఖరి వీడి స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించకుండా నిర్ణయం తీసుకోవాలన్నారు. దీక్షా శిబిరంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

గోతులు తవ్వి వదిలేశారు..



నెలన్నర కిందట తూతూ మంత్రంగా పూడ్చిన గోతులు



వర్షాలకు ఇలా...

అగనంపూడి : ప్రైవేటు నెట్ వర్క్ సంస్థలు కేబుళ్లు అమర్చేందుకు రహదారుల మధ్యలో గోతులు తవ్వి పూడ్చకపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. నెలన్నరక్రితం కొండయ్యవలస పరిసర ప్రాంతాల్లో రహదారుల మధ్యలో కేబుళ్లు అమర్చేందుకు గోతులు తవ్వారు. తరువాత వాటిని అరకొర మట్టితో పూడ్చి చేతులు దులుపుకొని వెళ్లిపోయారు. మట్టి పూడ్చిన తర్వాత కాంక్రీటు వేయాల్సిన బాధ్యత కూడా ఆయా ప్రైవేట్ నెట్ వర్క్ కంపెనీలదే అయినా అవేవీ సదరు సంస్థలు పట్టించుకోక పోవడంతో స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నారు. కాగా మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు గోతులు పూడుకుపోయి రహదారుల మధ్యలో గోతులు ఏర్పాడటంతో రాత్రి సమయంలో స్థానికులు పడిపోతున్నారు. వీటిపై జీవీఎంసీ అధికారులు దృష్టిసారించాలని స్థానికులు కోరుతున్నారు.

కరకచెట్టు పోలమాంబ జాతరకు ఏర్పాట్లు



ప్రచార రథం ప్రారంభిస్తున్న ఈవో సురేష్‌బాబా

ఏయూ క్యాంపస్: శ్రీకరకచెట్టు పోలమాంబ అమ్మవారి వార్షిక జాతర మహోత్సవ ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. ఆదివారం ఉదయం ఆలయంలో ఈవో డి.వి.ఎస్.సురేష్‌బాబా, ధర్మకర్తల మండలి చైర్మన్ పిడింట్ల శంకర్‌రెడ్డి కార్యక్రమ వివరాలతో కూడిన కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం అమ్మవారి ఉత్సవాలకు సంబంధించిన ప్రచారం రథాన్ని ప్రారంభించారు. అమ్మవారిని పూజించే 14 గ్రామాల్లో వచ్చే నెల 4వ తేదీ వరకు రథంలో అమ్మవారి ఉత్సవ విగ్రహన్ని ఊరేగిస్తారు.

- మహోత్సవాలలో భాగంగా సోమవారం పందిరిరాట మహోత్సవం, పుట్టబంగారం, అమ్మవారి దేవర పండగలను నిర్వహించనున్నారు.

వచ్చేనెల 3న తొలేళ్ల ఉత్సవం, 4న అనుపు మహోత్సవం జరపనున్నారు. 11న మూరు వారం పండగ నిర్వహించనున్నారు. 15న ఆలయంలో మహాన్నదానం ఏర్పాటు చేయనున్నారు. వచ్చేనెల 25వ తేదీ వరకు ఆలయంలో పండగ వాతావరణం కొనసాగనుంది.

- వార్షిక జాతరలో భాగంగా వచ్చేనెల 3వ తేదీ రాత్రి నుంచి తొలి పూజ, పంచామృత అభిషేకం ప్రారంభమవుతుందని ఈవో తెలిపారు. రూ.1,516 చెల్లించి ఈ పూజలో భక్తులు పాల్గొనవచ్చన్నారు. పూజకు దంపతులను మాత్రమే అనుమతిస్తామన్నారు.